

ద్రాక్షారామ భీమేశ్వర ఆలయంలో అవినీతిపై విజిలెన్స్ విచారణ - 5లో

సాహితీవేత్త 'రేకపల్లి' కన్నుమూత



మానేపల్లి ఇసుక ర్యాంపులో తవ్వకాలు (పాత చిత్రం)

ఇసుక, మట్టి ర్యాంపులపై నేతల కన్ను!

- పి.గన్నవరం నేతలతో మాఫియా మంతనాలు
- వైసీపీ హయాంలో అడ్డగోలుగా తవ్వకాలు
- హద్దులు దాటినా పట్టించుకోని వైనం
- కొత్త ప్రభుత్వంలోనైనా నిబంధనలు పాటిస్తారా!

పి.గన్నవరం, జూన్ 26: ప్రకృతి వనరులను వైసీపీ హయాంలో నిబంధనలు పక్కనపెట్టి అడ్డగోలుగా దోచుకుపోయారు. వాటిని కాపాడాల్సిన అధికారులు సైతం ఆ సమయంలో మౌనం వహించారు. కనీస నిబంధనలు పాటించకుండా కోట్లాది రూపాయల ప్రకృతి సంపదను కొల్లగొట్టారు. రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ పెద్దల అండదండలతో ఐదేళ్ల మాఫియా రాజ్యం నడిచింది. ఉన్నత స్థాయి అధికారులు సైతం వంత పాడడంతో క్షేత్రస్థాయిలో మాఫియాది ఇష్టారాజ్యంగా నడిచింది. సామాన్యుల గోడు కనీసం పట్టించుకోకపోగా ప్రశ్నిస్తే పట్టించుకునే వారే కరువయ్యారు. గోదావరి నదీ తీరం వెంబడి ఉన్న రైతులు సైతం కాసులకు కక్కుర్తిపడడంతో మాఫియాకు ఆడింది ఆట పాడింది పాటగా నడిచింది. పి.గన్నవరం మండలంలోని మానేపల్లి, మొండెపులంక, వైవీ పాలెం, ఉడిమూడి, పి.గన్నవరం, లంకల గన్నవరంల్లో మట్టి, ఇసుక తవ్వకాలు జరిపారు.

రాష్ట్రంలో ఏర్పడిన కొత్త ప్రభుత్వం ఇసుక విధానంపై నూతన మార్గదర్శకాలు విడుదల చేస్తుందని ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఈ తరుణంలో గోదావరి నదీ తీరంలో ఉన్న ఇసుక, మట్టి ర్యాంపులపై ప్రస్తుత ప్రభుత్వానికి సంబంధించిన పలువురు నేతల కన్నుపడినట్టు తెలిసింది. ఆ దిశగా నియోజకవర్గ పెద్దల సమక్షంలో మంతనాలు సైతం జరుగుతున్నాయని సమాచారం. ఇదిలా ఉండగా రెండు రోజుల క్రితం మండలంలోని వైవీ పాలెంలో మట్టి ర్యాంపును ప్రారంభించగా జనసేనకు చెందిన ఓ నేత అడ్డుకున్నాడు. విషయం తెలుసుకున్న నియోజకవర్గానికి చెందిన కొంతమంది కూటమి నేతలు సైతం లోపాయికారీగా రంగప్రవేశం చెయ్య డంతో ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని స్థానిక రెవెన్యూ అధికారులతో మట్టి తవ్వకాలకు అడ్డుకట్ట వేయించారు. నియోజకవర్గ పెద్దలు, స్థానిక అధికారుల ఆశీస్సులు లేకుండా మాఫియా తవ్వకాలు ప్రారంభిస్తుందా అని కొందరు గుసగుసలాడుకుంటున్నారు.

ర్యాంపుల నిర్వహణ విషయంలో కొంతమంది నాయకులు జిల్లా స్థాయి పెద్దలతో కూడా మంతనాలు జరుపుతున్నట్టు జోరుగా ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వాలు మారినా మాఫియాలు మారవని, కూటమిలోని ముఖ్య నేతలను ప్రసన్నం చేసుకుంటేనే మాఫియాకు అడ్డంకులు ఉండవని పలువురు చర్చించుకుంటున్నారు. కాగా ప్రస్తుతం మండలంలోని కొన్ని ముఖ్య ర్యాంపుల్లో ఇసుక, మట్టి తవ్వకాలు జరుపుకునేందుకు కొంతమంది నాయకులు ముఖ్య నేతలతో చర్చలు జరుపుతున్నట్టు తెలిసింది. ర్యాంపుల నిర్వహణకై ఇతర పార్టీల నేతలు సైతం ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అయితే రాబోయే పది రోజుల్లో గోదావరికి వరద నీరు వచ్చే అవకాశం ఉంది. అదే జరిగితే మట్టి, ఇసుక ర్యాంపులకు ఆరు నెలలు పాటు బ్రేక్ పడాల్సిందే. గోదావరికి వరద నీరు వచ్చినప్పటికీ కొంతవరకు పి.గన్నవరం, లంకల గన్నవరం, కె.ముంజవరం బోట్స్‌మెన్ ర్యాంపుల్లో మాత్రమే ఇసుక తీసుకునే అవకాశం ఉంది. కానీ బోట్స్‌మెన్ ర్యాంపులు నడపాలంటే గనుల శాఖ అధ్వర్యంలో నిబంధనలు అనుసరించి ఆయా ర్యాంపులకు పరిశీలనలు జరగాల్సి వుంది.

ర్యాంపు మంజూరు చెయ్యాలంటే....

ఇసుక, మట్టి ర్యాంపు మంజూరు చెయ్యాలంటే గనుల శాఖ అధ్వర్యంలో కొన్ని మార్గదర్శకాలు ఉన్నాయి. ఇసుక, మట్టి మేటలను గుర్తిస్తే సంబంధిత భూమి పత్రాలతో రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకోవాల్సి వుంది. రెవెన్యూ అధికా రులు పరిశీలించి భూమి వివరాలతో కూడిన ఎన్‌వోసీ ఇస్తారు. దాని సాయంతో గనుల శాఖకు దరఖాస్తు చేసుకుంటే సంబం ధిత అధికారుల ఆధ్వర్యంలో రెవెన్యూ, హెడ్‌వర్క్స్, భూగర్భ జల శాఖల ఆధ్వర్యంలో పరిశీలన అనంతరం సంబంధిత నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందిస్తారు. వారి సూచనల మేరకు గనుల శాఖ నిబంధనలు, హద్దులు, ఎంత మేర తవ్వకాలు జరపాలో తదితర అంశాలతో కూడిన అను మతి పత్రం ఇస్తుంది. కానీ గత ప్రభుత్వ హయాంలో ఒక్క ర్యాంపులో కూడా కనీస నిబంధనలు పాటించలేదన్న ఆరోపణలు ఉన్నాయి.

గత ప్రభుత్వం ప్రారంభంలో ఏపీఎండీసీ తర్వాత జేపీ, టర్నకీ, సుధాకర్ ఇన్‌ఫ్రా, ప్రతిమా... ఇలా సీజనుకో కంపెనీ పేరుతో సామాన్యుడికి అందని ద్రాక్షలా ఇసుక తవ్వకాలను జరిపించారు. ఆయా కంపెనీలు ఇసుక ఉంటే చాలు అనుమ తులతో మాకు పనేంటి అన్నచందంగా తవ్వకాలు జరిపారు. ఇప్పటివరకు అడ్డగోలుగా తవ్వకాలు జరిపిన వ్యక్తులు, సహకరించిన అధికారులపై ఏ విధమైన చర్యలు తీసుకుంటారనే దానిపై ఇంకా స్పష్టత లేదు.

అనుమతులు లేవు: ఎస్‌కే హుస్సేన్, తహసీల్దారు

మండలంలోని ఇసుక, మట్టి ర్యాంపులకు ఏ విధమైన అనుమతులు లేవు. అనుమతి లేకుండా ర్యాంపుల్లో తవ్వకాలు జరిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. సంబంధిత వాహనాలపై కేసుల నమోదుకు సిఫార్సు చేస్తాము.

'నగరం' విస్ఫోటనానికి పదేళ్లు



బాధిత కుటుం బాలకు నేటికీ పూర్తిస్థాయిలో జరగని న్యాయం...5లో

> ప్రత్యేక అవసరాలు గల పిల్లల బంగారు 'భవిత'వ్యానికై తల్లిదండ్రులు ఆశగా ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గతంలో టీడీపీ ప్రభుత్వంలో మాదిరిగా భవిత కేంద్రాలను పూర్తిస్థాయిలో ఆధు నికీకరిస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తు న్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఇచ్చే అలవె న్సులను సైతం సక్రమంగా విడుదల చేయలేదు. అలవెన్సులు కొందరికి ఇస్తే మరికొందరికి ఇవ్వలేని పరిస్థితి. కూట మి ప్రభుత్వం శారీరక, మానసిక దివ్యాం గులపై ప్రత్యేక దృష్టి సారించి ఆయా పిల్లల కుటుంబాలకు అండగా ఉంటుందని భావిస్తున్నారు.



ఫిజియోథెరపీ మెటీరియల్‌తో విద్యార్థి

'భవిత'పై ఆశతో...

- ప్రత్యేక అవసరాల పిల్లలకు అలవెన్సులు సకాలంలో చెల్లించాలి
- ఫిజియోథెరపిస్టు లను నియమించాలి



అమలాపురం రూరల్, జూన్ 26: ప్రత్యేక అవస రాలు గల పిల్లల బంగారు భవిష్యత్తుకు భవిత కేంద్రాలు బాటలు వేస్తున్నాయి. శారీరక, మానసిక వైకల్యంతో బాధపడే ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలా లు అందించడంతో పాటు వారి భవితకు బాటలు వేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో ఇటీవల ప్రత్యేక అవసరా లు గల పిల్లలపై సమగ్ర సర్వే నిర్వహించారు. జిల్లాలోని 22 మండలాల్లో 2,580 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఉండగా తాజాగా నిర్వ హించిన సర్వేలో 613 మందిని అదనంగా గుర్తిం చారు. వీరందరికీ ప్రభుత్వపరంగా సంక్షేమ పథకా ల ఫలాలు అందేలా జిల్లా అధికారులు సమగ్ర నివేదికను తయారుచేసి రాష్ట్ర ఉన్నతాధికారులకు పంపించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశం కల్పించారు.

జిల్లాలో 22 భవిత కేంద్రాలను ఏర్పాటు చేశా రు. 2011లో వీటికి అంకురార్పణ జరిగింది. 2014 లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గ కేంద్రాల్లో భవిత కేంద్రాల నిర్మాణం చేపట్టింది. అమలాపురం రూరల్ బండా రులంకలో 2016లో భవిత కేంద్రాన్ని ప్రారంభించా రు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను రామచంద్రపు రంలో మాత్రమే భవిత కేంద్రాన్ని నిర్మించలేదు. మిగిలినకేంద్రాలను ఆయా పాఠశాలల్లోనే ప్రత్యేక తరగతి గదుల్లో నిర్వహిస్తున్నారు. భవిత కేంద్రాలకు 486 మంది పిల్లలు వస్తున్నారు. వీరంతా శారీరకంగా, మాన సిక సమస్యలతో ఉన్న పిల్లలు కావడంతో ఆటపాటలతో చదువు చెప్పాల్సి న అవసరం ఉంది. ఈ నేపథ్యంలోనే వీరికి అవసరమైన ఆట వస్తువుల ను, ఇతర పరికరాలను టీడీపీ ప్రభుత్వ హయాంలోనే సమకూర్చారు.

జిల్లాలో భవిత కేంద్రాలు: 22
ప్రత్యేక అవసరాలు గల పిల్లలు: 3,193
కేంద్రాలకు వచ్చే పిల్లలు: 486
ఇళ్ల వద్దే సేవలు పొందేవారు: 220
పనిచేస్తున్న ఐఈఆర్టీలు: 44 మంది
ఆయాలు: 22 మంది
ఫిజియోథెరపిస్టులు: ఇద్దరు
(ఐదు పోస్టులు ఖాళీ)



ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రత్యేకంగా పాఠాలు చెప్తున్న ఐఈఆర్టీ సిబ్బంది

జిల్లాలోని భవిత కేంద్రాల్లో పనిచేసేం దుకు ఏడుగురు ఫిజియోథెరపిస్టులు అవసరం. ప్రస్తుతం ఇద్దరు మాత్రమే పని చేస్తున్నారు. మిగిలిన ఐదుగురిని వైసీపీ ప్రభుత్వంలో నియ మించలేకపోయారు. కనీసం భవిత కేంద్రంలోని పిల్లల కోసం ఫిజియోథెరపీ మెటీరియల్, వాకింగ్ స్టిక్‌లను సైతం అందించలేదు. టీడీపీ హయాంలో సమకూర్చిన వాటితోనే భవిత కేంద్రాల నిర్వహణ జరుగుతోంది. త్వరలోనే ఫిజియోథెరపిస్టుల నియ మాకానికి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు.

అలవెన్సులు సక్రమంగా చెల్లించాలి

భవిత కేంద్రాల్లోని పిల్లలకు అప్పటి టీడీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రత్యేక అలవెన్సు అందజేసే ది. ఎస్కార్ట్ అలవెన్స్‌కింద నెలకు రూ.300 చొప్పున ఏటా పది నెలలు అందించేవారు. ట్రాన్స్‌పోర్టు అల వెన్సు కింద పది నెలల పాటు రూ.3వేలు, బాలిక ల స్టైఫండ్ కింద పది నెలలకు రూ.2వేలు, హోం బేస్డ్ ఎడ్యుకేషన్ అలవెన్స్ కింద పది నెలలకు రూ.2వేలు, అంధ విద్యార్థులకు రీడర్ అలవెన్సు కింద పది నెలలకు రూ.3వేలు అందజేసేవారు. వైసీపీ హయాంలో కనీసం అలవెన్సులు సైతం సక్రమంగా అందించలేని దుస్థితి. కొందరికి ఇస్తే మరికొందరికి ఇవ్వలేని పరిస్థితి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినం దున భవిత కేంద్రాలపై దృష్టి సారించి శారీరక, మానసిక దివ్యాంగులకు ఇచ్చే అలవెన్సులను పెంచడంతో పాటు సకాలంలో చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

కుండలేశ్వరంలో క్షుద్ర పూజల కలకలం

- బెంబేలెత్తుతున్న గ్రామస్తులు
- కాట్రేనికోన పోలీసులకు ఫిర్యాదు

ఉప్పలగుప్తం (కాట్రేనికోన), జూన్ 26: కాట్రేనికోన మండలంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కుండలేశ్వరంలో క్షుద్ర పూజలు జరుగుతున్నాయన్న సమాచారంతో జనం బెంబేలెత్తుతున్నారు. చీకటి పడుతోందంటే చాలు భయంభయంగా గడుపుతున్నారు. కుండలేశ్వరం స్నాన ఘట్టం వద్ద శ్మశానవాటికలో అర్ధరాత్రి ఇద్దరు వ్యక్తులు నెల రోజులుగా పూజలు చేస్తున్నారు. ఆ సమయంలో బహిర్భూమికి వెళ్లిన వారు ఈ విషయాన్ని మరికొంద రికి చెప్పడంతో గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల్లో ఈ వార్త దావాలనంలా వ్యాపించింది. కొన్ని రోజులుగా కుండలేశ్వరం పంచాయతీ నక్కావారిపేటలో ఒక ఇంట్లో రాత్రివేళ 20 మంది యువకులు పూజలు చేస్తున్నారని, ఆ ఇంట్లో వారిని వారి బంధువుల ఇంటికి పంపివేశా రన్న సంగతి చర్చనీయాంశమైంది. స్థానికేతర యువ కులు రాత్రి వేళ దిగంబరంగా పూజలు జరుపుతున్నట్టు, అర్ధరాత్రి దాటిన తర్వాత గోదావరి ఒడ్డున క్షుద్రపూజలు నిర్వహిస్తున్నారని చెప్పుకుంటున్నారు. పూజలు చేస్తున్న ప్రాంతానికి వెళ్లేందుకు జనం భయపడుతున్నారు. ఈ సమాచారం గ్రామమంతా వ్యాపించడంతో క్షుద్రపూజలు నిర్వహిస్తున్నారని చెప్పుకుంటున్న ఇంటి ముందు నుం చి జనం రాకపోకలు విరమించుకున్నారు. తమ గ్రామంలో ఏమి జరుగుతుందోనన్న ఆందోళనతో ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. కాగా క్షుద్ర పూజలు నిర్వహి స్తున్న వారిని అదుపులోకి తీసుకుని పూజల గుట్టును రట్టు చెయ్యాలంటూ మంగళవారం కొందరు కాట్రేనికోన పోలీసులకు ఫిర్యాదు చేశారు.





నక్కావారిపేటలో క్షుద్ర పూజలు చేస్తున్నారని భావిస్తున్న గదిలో దృశ్యం, క్షుద్ర పూజలకు వినియోగిస్తున్న సామగ్రి





అమలాపురం గడియార స్తంభం సెంటర్లో డ్రగ్స్ రహిత సమాజానికై ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్పీ శ్రీధర్

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలి: ఎస్పీ శ్రీధర్

అమలాపురం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వా ములు కావాలని ఎస్పీ ఎస్.శ్రీధర్ పిలుపునిచ్చారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల నిర్మూలనను సామాజిక బాధ్యతగా పౌరులు గుర్తించి పోలీసులకు సహకరించాలని కోరారు. అంతర్జాతీయ డ్రగ్స్ దుర్విని యోగం-అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ ర్యాలీని విద్యార్థులు, మహిళలతో కలిసి అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాల వద్ద ఎస్పీ జెండా ఊపి ప్రారంభించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్ర వ్యాల మహమ్మారి నుంచి ప్రజలను కాపాడేందుకు కఠినంగా వ్యవహరిస్తున్నామన్నారు. మత్తు పదార్థా లకు బానిసలు కాకుండా జిల్లాను,రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దేందుకు అందరూ ముందుకు రా వాలన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల రవా ణాను పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక బృందాలతో నిఘా వ్యవస్థ ఏర్పాటు చేశామన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే పరిణామా లను వివరిస్తూ పోలీసు శాఖ ఆధ్వర్యంలో గత పది రోజులుగా అవగాహన సదస్సులు నిర్వహించామన్నా రు. గంజాయి వ్యసనానికి బానిసగా మారిన వారిని ప్రభుత్వ డీ అడిక్షన్ కేంద్రానికి తరలించి తిరిగి వారి ని సమాజంలో సాధారణ పౌరులుగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గంజాయి అక్రమ రవాణా, సరఫరా సమాచారం తెలియజేసేందుకు ప్ర త్యేక టోల్‌ఫ్రీ నంబరు 14500 ఏర్పాటు చేశామన్నా రు. మాదకద్రవ్యాలకు యువత బానిసలైతే ఆయా కుటుంబాలు ఎదుర్కొంటున్న అవమానాలను గుర్తిం చాలన్నారు. అనంతరం అమలాపురం కిమ్స్ వైద్య క ళాశాలలో వైద్య విద్యార్థులకు నిర్వహించిన అవగాహ న సదస్సులో ఎస్పీ శ్రీధర్ పాల్గొని మాట్లాడారు. అద నపు ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా, ఏఆర్‌డీఎస్పీ విజయసా రధి, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, డీఆర్డీ ఏ పీడీ డాక్టర్ వి.శివశంకరవరప్రసాద్, డాక్టర్ సుమ, డాక్టర్ కొప్పుల నాగమానస, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కేవీ భూ పేష్, తాలూకా సీఐ పి.వీరబాబు, ఎస్ఐ వై.శేఖర్‌బా బు, జనకల్యాణ్ సంస్థ ప్రతినిధి శ్రీనివాస్, ఆదిత్య, విద్యానిధి, ఏఎస్ఎన్ కళాశాలల విద్యార్థులతో పాటు అధిక సంఖ్యలో మహిళలు ర్యాలీలో పాల్గొన్నారు.

జిల్లాలో లక్షా 68వేల 780 ఎకరాల్లో వరి సాగు: వ్యవసాయ శాఖాధికారి బోసుబాబు

రాయవరం, జూన్ 26: జిల్లాలో లక్షా 68వేల 780 ఎకరాల్లో వరి సాగు జరుగుతోందని జిల్లా వ్యవసాయ అధికారి ఓలేటి బోసుబాబు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం పసలపూడి గ్రామంలోని పంట పొలాలను బుధవారం ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లాలో 3,404 ఎకరాల్లో నారుమళ్లు వేశారన్నారు. 1,764 ఎకరాల్లో వెదజల్లగా, 541 ఎకరాల్లో వరి నాట్లు వేసినట్టు వివరించారు. జిల్లాలో రైతులకు సరిపడా వరి విత్తనాలు రైతు భరోసా కేంద్రాల వద్ద, ప్రైవేటు డీలర్ల వద్ద అందుబాటులో ఉన్నాయన్నారు. జిల్లాలో 43,642 మెట్రిక్ టన్నుల అన్ని రకాల ఎరువులు రైతు భరోసా కేంద్రాలు, ప్రైవేటు డీలర్లు, వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, ఏపీ మార్క్‌ఫెడ్ వద్ద ఉన్నాయని చెప్పారు. రైతులు త్వరితగతిన వరినాట్లు పూర్తి చేయాలని, ఇంకా నారుమడులు వేయని రైతులు వెదసాగుకు వెళ్లడం వల్ల సమయం వృధా కాకుండా ఉంటుందని సూచించారు. నారుమడిపై సస్యరక్షణ చర్యలు చేపట్టడం వల్ల ప్రధానంగా పొలంలో నాట్లు వేసిన నెల వరకు ఎటువంటి తెగుళ్లు, పురుగులు ఆశించకుండా ఉంటాయన్నారు. దీనివల్ల పెట్టుబడి ఖర్చును ఆదా చేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. పరిశీలనలో మండల వ్యవసాయ అధికారి కె.ప్రభాకర్, గ్రామ వ్యవసాయ సహాయకుడు షారుని తదితరులు పాల్గొన్నారు.



పసలపూడిలో వరి పొలాన్ని పరిశీలిస్తున్న బోసుబాబు

సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

పదో తరగతి 86.51 శాతం ఉత్తీర్ణత

అమలాపురం టౌన్, జూన్ 26: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ప రీక్షా ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీ మ జిల్లలో 86.51 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 1,950 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా బాలురు 1,036 మంది బాలికలు 651 మంది... మొత్తం 1,683 మంది ఉత్తీర్ణులయ్యారు.

ఇంటర్‌లో 31శాతం ఉత్తీర్ణత

ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు బుధవా రం విడుదలయ్యాయి. ఇంటర్ మొదటి సంవత్సరం జనరల్ విభాగంలో జిల్లా నుంచి 31 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. జనరల్ విభాగం లో 3,745 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 1,143 మంది ఉత్తీర్ణులయ్యారు. మొదటి సంవత్సరం ఒకేషనల్ విభాగంలో జిల్లా నుంచి విద్యార్థులు 38శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. 763 మంది పరీక్షకు హాజరు కాగా 291 మంది ఉత్తీర్ణులయ్యారు.



ఎగసిపడుతున్న అగ్నికీలలు(ఫైల్‌ఫొటో)





పైపులైన్ పేలడంతో ఏర్పడిన గొయ్యి

గెయిల్ పైపులైన్ పేలుడు జరిగి నేటికి పదేళ్లు

బాధిత కుటుంబాలకు నేటికీ పూర్తిస్థాయిలో జరగని న్యాయం

మామిడికుదురు, జూన్ 26: 2014 జూన్ 27. ఆ రోజు తెల్లవారుజామున డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం నగరం గ్రామంలో భారీ విస్ఫోటనం సంభవించింది. ఏమి జరిగిందో తెలిసే లోపలే 22 మంది సజీవదహనమయ్యారు. గెయిల్ సంస్థకు చెందిన ట్రంక్ పైపులైన్ పేలడంతో ఒక్కసారిగా అగ్నికీలలు చుట్టిముట్టి 22 మందిని పొట్టన పెట్టుకోవడమే గాక పలువురిని గాయాలపాల్జేసింది. ఈ దుర్ఘటన జరిగి నేటికి పదేళ్లు పూర్తవుతోంది. ఆనాటి విషాదాన్ని గుర్తుచేసుకుంటూ నగరం గ్రామవాసులు భయాందోళనకు గురవుతున్నారు. గెయిల్ పైపులైన్ విస్ఫోటనం తర్వాత అప్పట్లో ప్రభుత్వం, అధికారులు ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని బాధితులు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నగరం గ్రామాన్ని దత్తత తీసుకుని సకల సౌకర్యాలు కల్పించి మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దుతామని ఇచ్చిన హామీలు ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదు. గ్రామంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తామని, స్థానికులకు ఉద్యోగ అవకాశాలు, ఇంటింటికీ తాగునీరు, వంట గ్యాస్ ఉచితంగా ఇస్తామని.. ఇలా పదుల సంఖ్యలో ఇచ్చిన హామీలు పదేళ్లు కావస్తున్నా అమలు కాలేదని ఈ ప్రాంత వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రభుత్వం స్పందించి గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు గెయిల్ సంస్థ నుంచి నిధులు రాబట్టేలా చర్యలు తీసుకోవాలని నగరం దీవి ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

సాహితీవేత్త 'రేకపల్లి' కన్నుమూత



రేకపల్లి శ్రీనివాసమూర్తి

అమలాపురం టౌన్, జూన్ 26: సీనియర్ న్యాయవాదిగా సేవలు అందిస్తూనే సంగీత, సాహిత్య రంగాలకు ఎనలేని సేవలు అందించిన రేకపల్లి శ్రీనివాసమూర్తి (81) బుధవారం ఉదయం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని ఆయన స్వగృహంలో కన్నుమూశారు. వృద్ధాప్యంతో పాటు కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. సంగీతంపై ఉన్న మక్కువతో శ్రీభారతి గానసభను స్థాపించడమే కాకుండా మంగళంపల్లి బాలమురళీకృష్ణ, చిట్టిబాబు వంటి మహామహులతో అమలాపురంలో సంగీత కచేరీలు నిర్వహించారు. సాహితీ రంగంపై మక్కువతో సాహితీ మిత్రమండలిని స్థాపించి యద్ధనపూడి రామకృష్ణ, పోచినపెద్ది కామసత్యనారాయణ వంటి ప్రముఖులెందరినో సత్కరించారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడిగా, ఆలిండియా రేడియో ఆర్టిస్టుగా, సంస్కార భారతి పూర్వ అధ్యక్షుడిగా.... విశేష సేవలు అందించారు. ఎందరినో కవులుగా తీర్చిదిద్ది మరెందరినో ప్రోత్సహించారు. శ్రీనివాసమూర్తికి భార్య మహాలక్ష్మి, కుమార్తె ఫణి, కుమారుడు కృష్ణ ఉన్నారు. పిల్లలిద్దరూ అమెరికాలో స్థిరపడ్డారు. ఈశ్వరునిపై ఎనలేని భక్తితో 70కు పైగా భక్తి శతకాలను రాసిన ఘనత రేకపల్లికే దక్కుతుంది. రేకపల్లి మృతి సంగీత, సాహితీ రంగాలకు తీరని లోటని డాక్టర్ గోదశి గంగరాజు, డాక్టర్ కొప్పిసీడి వెంకటరమణకుమార్, బులుసు జగదీష్, కాంబాబు, ఫుత్సా కృష్ణ కామేశ్వర్, నల్లా నరసింహమూర్తి, మాడా రాము, జాన మల్లికార్జున రావు నివాళులర్పించారు.

ఎనీమియా ముక్త భారత్ అమలుపై కేంద్ర బృందం ఆరా

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 26 :జిల్లాలో ఎనీమియా ముక్తి భారత్ అమలుపై కేంద్ర బృందం సభ్యులు జితేంద్ర సింగ్, ఎస్ పూజ క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. బుధవారం జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బొమ్మూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలో జరిగిన సమీక్షలో జిల్లా వైద్యా ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరావు మాట్లాడారు. రక్తహీనత నివారణే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రజలు బలవర్ధకమైన ఆహారం అంటే ఆకుకూరలు, కాయగూరలు, బెల్లం, పప్పు దినుసులు వంటివి తీసుకోవడం వల్ల హిమోగ్లోబిన్ శాతం పెరిగి తద్వారా రక్తహీనత అధిగమించవచ్చునని తెలిపారు. జిల్లాలో కేంద్ర బృందం సభ్యులు జితేంద్ర సింగ్, ఎస్.పూజ పాలచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లోను, అంగన్వాడీ సెంటర్‌ను పరిశీలన చేసి అక్కడ పిల్లలకు అందించే ఐరన్ పోలిక్ యాసిడ్ గురించి ఆరా తీశారు. అంగన్వాడీ సెంటర్‌లో ఐదేళ్ల లోపు పిల్లలకు వారానికి రెండు సార్లు ఇచ్చే ఐఎఫ్‌ఏ సిరప్‌లు గురించి తెలుసుకున్నారు. అదే విధంగా శాటిలైట్ సిటీ-3 లో ఉన్న విలేజ్ హెల్త్ క్లినిక్ లో, అంగన్వాడీలో అమలవుతున్న కార్యక్రమాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఎన్.రాజకుమారి, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ మౌనిక ,బీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హరిచంద్ర ప్రసాద్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'పవన్ దృష్టికి సమస్యలు తీసుకెళ్తాం'

రంపచోడవరం, జూన్ 26: గిరిజన గురుకుల విద్యాలయాల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ ఉద్యోగుల సమస్యలు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని గురుకుల విద్యాలయాల నాన్ టీచింగ్ యూనియన్ నాయకుడు మాదే రామచంద్రరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉప ముఖ్యమంత్రి జూలై 1 నుంచి 3వ తేదీ వరకు పిఠాపురంలో అందుబాటులో ఉంటారని వారి దృష్టికి సమస్యలను తీసుకెళ్లాలన్నారు. 010 పద్దును 10వ షెడ్యూల్లో ఉన్న గిరిజన గురుకులం, గురుకులాలకు వర్తింపజేయాలని, గురుకుల విద్యాలయాల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం టైంస్కేల్, గత 15 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయ జూనియర్ లెక్చరర్లకు జీతాల పెంపుదల తదితర సమస్యలు రాష్ట్ర అధ్యక్షుడు హరి, జిల్లా అధ్యక్షుడు సూర్యారావు అధ్వర్యంలో విన్నవించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు.

ద్రాక్షారామ భీమేశ్వర ఆలయంలో అవినీతిపై

విజిలెన్స్ విచారణ



బహిరంగ విచారణ నిర్వహిస్తున్న మంత్రి సుభాష్

- మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రకటన
- ఆలయం వద్ద మంత్రి సుభాష్ ఆధ్వర్యంలో బహిరంగ విచారణ
- మాజీ మంత్రి వేణు హయాంలో జరిగిన అవకతవకలను వివరించిన పలువురు భక్తులు
- చందాలతో రథం తయారీ.. కానీ శిలాఫలకంపై మాజీ మంత్రి వేణు పేరు..

ద్రాక్షారామ, జూన్ 26: ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో జరిగిన అవినీతి కార్యకలాపాలకు సంబంధించి వచ్చిన ఆరోపణలపై విజిలెన్స్ విచారణకు ఆదేశించినట్లు కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ బుధవారం ప్రకటించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ద్రాక్షారామ భీమేశ్వరాలయం వద్ద బుధవారం అవినీతి ఆరోపణలకు సంబంధించి బహిరంగ విచారణ జరిగిది. ఆలయ ఈవో పి.టి.వి సత్యనారాయణ సమక్షంలో నిర్వహించిన బహిరంగ విచారణలో గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి.

భక్తులు చందాలు ఏమైనట్లు?

భీమేశ్వర స్వామివారి రథం తయారీపై వచ్చిన ఆరోపణలపై విచారించారు. రథం తయారీకి అర్చకులు రూ.30 లక్షలు వరకు భక్తుల నుంచి చందాలు వసూలు చేసి ఇచ్చినట్లు తెలపగా మాజీ మంత్రి వేణు రథం తయారు చేయించినట్లు శిలాఫలకం వేయడం, తదుపరి భక్తులు గొడవ చేయగా శిలాఫలకం మార్చి మరో శిలాఫలకం పెట్టడంపై మంత్రి సుభాష్ ఈవోను నిలదీశారు. భక్తుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసినట్లు భక్తులు చెప్పారు.

మాజీ మంత్రి ఇంటికి ఆలయం నుంచి ఆహార పదార్థాలు

మాజీ మంత్రి వేణు ఇంటిలో ఎటువంటి కార్యక్రమాలు జరిగినా ఆలయం నుంచి ఆహారపదార్థాలు వండి పంపించారన్న ఆరోపణలపై ఆలయంలో వంటమనిషిని పిలిపించి మాట్లాడారు. వంటలు చేసే రాఘవేంద్రస్వామి చాలాసార్లు వంటలు వండి పంపించామని మంత్రి సుభాష్ ఎదుట తేల్చిచెప్పారు. అదే విధంగా ఆలయ ప్రాంగణంలో షాపుల యజమానుల వద్ద లీజు పొడిగింపునకు షాపుకు రూ.5 వేలు చొప్పున వసూలు చేసినట్లు షాపుల యజమానులు మంత్రి ఎదుట స్పష్టం చేశారు. అలాగే ఆలయంలో పార్కింగ్ స్థలంలో వాహనాలు పార్కింగ్ పాటదారులు భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారని భక్తులు ఆరోపణలు చేశారు. అదే విధంగా ఆలయంలో వివాహాలు చేసుకునే సామాన్యుల నుండి నిర్దేశించిన మొత్తం కాకుండా వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని ఈవో పట్టించుకోలేదని ఆళ్లబుజ్జి ఆరోపించారు. కనీసం బోర్డులు కూడా పెట్టలేదన్నారు. గతంలో వివాహాలు ఆలయంలో జరిగేవని వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత బాహ్యాప్రాంగణంలో చేసుకోవాలని ఆదేశాలు ఇచ్చారని మంత్రి దృష్టికి భక్తులు తీసుకువెళ్లారు.

సప్తగోదావరి అభివృద్ధి పనుల్లో అవినీతి

అదే విధంగా సప్తగోదావరి అభివృద్ధి పనుల్లో కూడా అవినీతి చోటు చేసుకుందని ఉపాధి హామీ పథకంలో పనులు చేసి ప్రభుత్వం నుంచి కూడా నిధులు డ్రా చేశారని పలువురు ఆరోపించారు. మాజీ మంత్రి వేణు ఆలయానికి వస్తే భక్తులకు దర్శనాలు నిలిపివేశారని భక్తులు ఆరోపించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు హయాంలో కూడా ఇలా జరగలేదన్నారు. దీనిపై మంత్రి సుభాష్ మాట్లాడుతూ ఇకపై తనకు కూడా ప్రోటోకాల్ వద్దని సామన్య భక్తులకు దర్శనాలు కల్పించడమే ప్రధానమన్నారు. అదే విధంగా జనరేటర్ డీజిల్ సొంత వాహనాలకు వాడుకున్నారని, ఆలయ వసతి గృహాలు వాడుకున్నారని, ప్రసాదం పంపిణీ, పూల అలంకరణ, డ్రైఫ్రూట్స్ కొనుగోళ్లలో అవినీతి జరిగిందని ఆరోపణలు చేశారు. మాజీ మంత్రి వేణు అనుచరులు ఇద్దరు వలంటీర్లకు ఆలయంలో అవుట్‌సోర్సింగ్‌లో ఉద్యోగాలు కల్పించి రెండు చోట్లా వేతనాలు చెల్లిస్తున్నట్లు తేల్చారు. వీరిని వెంటనే తొలగించాలని ఆదేశించారు. వీటిపై మంత్రి సుభాష్ మాట్లాడుతూ విజిలెన్స్ అధికారులు అన్నీ తేలుస్తారని ఆలయంలో కొంతమంది ఉద్యోగులు సస్పెండ్ అవుతారని అన్నారు.

ఆలయంలో భారీ అవినీతి: మంత్రి సుభాష్

భీమేశ్వరాలయంలో వైసీపీ ప్రభుత్వంలో మాజీ మంత్రి వేణు హయాంలో భారీ అవినీతి చోటు చేసుకుందని మంత్రి సుభాష్ అన్నారు. బహిరంగ విచారణ అనంతరం విలేకరులతో మంత్రి మాట్లాడారు. రథం తయారీలో లక్షలాది రూపాయలు వసూలు చేశారని తేలిందన్నారు. శిలా ఫలకాలు పెట్టి తొలగించడం సాక్ష్యాదారాలతో సహా దొరికాయన్నారు. ప్రోటోకాల్ పేరుతో భక్తులకు గంటలు గంటలు దర్శనం జరగకుండా చేశారన్నారు. జనరేటర్లు అమ్మేసుకున్నట్లు తేలిందన్నారు. మొత్తం వ్యవహారాలపై విజిలెన్స్ విచారణకు ఆదేశించామన్నారు. టీడీపీ నాయకులు దొంగల శ్రీధర్, సర్పంచ్ కొత్తపల్లి అరుణ, చోడిశెట్టి శివాజీ అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. అంతకు ముందు మంత్రి సుభాష్ భీమేశ్వరస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో సప్తగోదావరి, వసతి గృహాలను పరిశీలించారు.

చెత్తకుప్పల్లో ఆధార్ కార్డులు..పోస్టల్ నిర్లక్ష్యంపై విమర్శలు



చెత్త కుప్పల్లో కార్డులు

సర్పవరం జంక్షన్, జూన్ 26: ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆధార్ కార్డు తప్పనిసరి. ఎలాంటి దరఖాస్తు చేయాలన్నా..ప్రభుత్వ తదితర పథకాలు అందాలన్నా ఇదే కీలకం. అంతటి ప్రాధాన్యత కలిగిన ఆధార్ కార్డులు కస్టమర్ల చేతికి బట్వాడా చేయాల్సిన పోస్టల్ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చెత్తకుప్పల్లో ఆధార్ కార్డులు దర్శనమివ్వడమే దానికి నిదర్శనం. చెత్తసేకరించేందుకు విచ్చేసిన పారిశుధ్య కార్మికుల కంట పడటంతో పోస్టల్‌శాఖ సిబ్బంది నిర్వాకం బయటపడింది. వివరాల్లోకెళితే కాకినాడ రూరల్ మండలం సర్పవరం మహారాష్ట్ర బ్యాంకు వీధిలో పోస్టాఫీసు బ్రాంచి కార్యాలయం ఉంది. ఆఫీసు బయట ఫైబర్ డస్ట్‌బిన్‌లో ఉన్న చెత్తా, వ్యర్థాలను సేకరించేందుకు బుధవారం ఉదయం సర్పవరం గ్రామ పంచాయతీకి చెందిన శానిటేషన్ వర్కర్లు వచ్చారు. డస్ట్‌బిన్‌లో ఉన్న వ్యర్థాలు బయటకు తీసి ట్రాక్టర్‌లోకి లోడ్ చేసే క్రమంలో అటుగా వెళుతోన్న స్థానికుడు ఎల్ఎస్ వీరభద్రరాజు గుర్తించి ఒరిజినల్ ఆధార్‌కార్డులుగా పరిశీలించి ఈ విషయాన్ని పోస్ట్‌మాస్టర్ సత్యనారాయణకు సమాచారం అందించారు. ఆయన తక్షణమే అక్కడకు వచ్చి ఆధార్‌కార్డులను పరిశీలించి, వెనక్కి తీసుకెళ్లి సంబంధిత కస్టమర్లకు పంపిణీ చేయించడంతో సమస్య సద్దుమణిగింది. ఈ విషయమై పోస్ట్‌మాస్టర్ సత్యనారాయణను వివరణ కోరగా రెండ్రోజుల కిందట తమ పోస్టాఫీసులో యాన్యువల్ ఇన్స్‌పెక్షన్ జరిగిందని, కార్యాలయం అంతా క్లీనింగ్ చేయించి, ఆధార్‌కార్డులు, ఇతర పత్రాలను ఒకచోట పెట్టగా పొరపాటున స్వీపర్ వీటిని తీసుకెళ్లి డస్ట్‌బిన్‌లో వేశారన్నారు. పోస్టల్ శాఖ అధికారులు,సిబ్బంది నిర్లక్ష్యవైఖరితో విలువైన ఆధార్‌కార్డులు చెత్తకుప్పలు పాలయితె తమ పరిస్థితి ఏంటని కస్టమర్లు ప్రశ్నించారు. పోస్టల్ సిబ్బంది నిర్లక్ష్య వైఖరిపై ఆ శాఖ ఉన్నతాధికారులు విచారణ నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కాకినాడలో రెండు రోజులు
మంత్రి నాదెండ్ల పర్యటన



కాకినాడ సిటీ, జూన్ 26: రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈనెల 28,29 తేదీల్లో కాకినాడలో పర్యటించనున్నారు. 28వతేదీ ఉదయం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, పౌరసరఫరాల సంస్థ అధికారులు, ప్రజాప్రతినిధులతో ప్రజా పంపిణీ వ్యవస్థ పనితీరుపై సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీ ద్వారా రేషన్‌బియ్యం పంపిణీని పరిశీలించనున్నారు. 29వతేదీ ఉదయం రేషన్ డీలర్లు, ఎండీయూ వాహనదారులు, కార్డుదారులతో సమావేశం జరపనున్నారు. జిల్లాలో రబీ సీజన్‌లో చేపట్టిన ధాన్యం సేకరణ, కనీస మద్దతు ధర చెల్లింపు తదితర అంశాలపై ఆయా శాఖల సంబంధిత అధికారులు, రైతులతో మంత్రి నాదెండ్ల మనోహర్ సమావేశం నిర్వహిస్తారు. ఈ మేరకు రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ వైస్‌చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జి.వీరపాండ్యన్ సర్క్యులర్ జారీ చేశారు.

సెల్‌ఫోన్ల రికవరీ

రాజమహేంద్రవరం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్(సీఈఐఆర్) సహాయంతో చోరీకి గురైన 13 సెల్‌ఫోన్లు రికవరీ చేసి ఫిర్యాదుదారులకు అందజేశామని ప్రభుత్వ రైల్వే పోలీస్(జీఆర్పీ) సీఐ పి.విజయశంకర్ తెలిపారు. వాటి విలువ సుమారు రూ.1 లక్షా 35 వేలు ఉంటుందన్నారు. సీఈఐఆర్ ద్వారా ఇప్పటివరకూ మొత్తం 33 సెల్‌ఫోన్లు రికవరీ చేశామన్నారు. చోరీకి గురైన ఫోన్లు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉండగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వాటిని రప్పించామన్నారు. ప్రయాణికులు సీఈఐఆర్ పోర్టల్ వినియోగించుకోవాలని ఆయన సూచించారు. దర్యాప్తులో ప్రతిభ చూపిన సీఐ విజయ్‌శంకర్, ఎస్ఐలు మావుళ్లు, లోవరాజు సిబ్బందిని డీఎస్ఆర్పీ ఎల్.మోహనరావు అభినందించారు.

4 నుంచి మరిడమ్మ జాతర ఉత్సవాలు



వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

పెద్దాపురం, జూన్ 26: వచ్చే నెల 4 నుంచి ప్రారంభమయ్యే మరిడమ్మ జాతర మహోత్సవాలను విజయవంతం చేయాలని ఆర్డీవో జె. సీతారామారావు కోరారు. పెద్దాపురం మరిడమ్మ దేవస్థానంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ చేబ్రోలు రామ్మోహనరావు ఆధ్వర్యంలో జాతర నిర్వహణ ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని బుధవారం మాట్లాడారు. జాతరకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. సుమారు 37 రోజులపాటు జరిగే ఈ జాతర మహోత్సవాలకు వేలాదిగా భక్తులు తరలిరానున్న నేపథ్యంలో ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ జాతర మహోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్, వైద్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

బావిలో బిహార్ వాసి మృతదేహం



శర్మ..ఫైల్‌ఫొటో



మృతదేహాన్ని వెలికితీస్తున్న సిబ్బంది

తుని రూరల్, జూన్ 26: కాకినాడ జిల్లా తుని పట్టణం రాణి సుభద్రయమ్మ పేట వద్ద బావిలో మృతదేహం కలకలం రేపింది. బిహార్‌కి చెందిన ఉత్తంకుమార్ శర్మ(39)తునిలోని ఒక హోటల్‌లో వంట మేస్త్రిగా పని చేస్తున్నాడు. కొన్ని రోజులుగా అతను కనబడకపోవడంతో కుటుంబ సభ్యులు ఈ నెల 10న తుని పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా మిస్సయిన వ్యక్తి మృతదేహం బావిలో కనిపించింది. దీంతో పోలీసులు మృతదేహాన్ని పైకి తీయించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. శర్మకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

విద్యార్థుల నిజాయితీ

దొరికిన సెల్‌ఫోన్‌ను పోలీసులకు అప్పగించిన వైనం



ఫోన్ అప్పగించిన విద్యార్థులు వీరే..

ఆత్రేయపురం, జూన్ 26: దొరికిన మొబైల్‌ను పోలీసులకు అప్పగించి ఐదుగురు విద్యార్థులు నిజాయితీ చాటుకున్నారు. బుధవారం ఆత్రేయపురం మహర్షి విద్యానికేతన్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులకు స్కూలు సమీపంలో మొబైల్ ఫోన్ దొరికింది. వారు నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫోన్ ఎవరిదో తెలుసుకుని అప్పగించాలని అందించారు. విద్యార్థులను ఎస్ఐ శ్రీనివాస్ అభినందించారు. అనంతరం సెల్ పోగొట్టుకున్న ఇంటర్ విద్యార్థి ధనరాజుకు మొబైల్‌ను అప్పగించారు. నిజాయితీ చాటిన విద్యార్థులను పోలీసులు అభినందించారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో 'తిరుమల' ప్రతిభ

రాజమహేంద్రవరం రూరల్ జూన్26:రాష్ట్రప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్ ప్రథమ సంవత్సరం సప్లమెంటరీ ఫలితాల్లో రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరులో గల తిరుమల విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్టు విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను 468 మార్కులను ఎం.ప్రియహాసిని, సీహెచ్ హాసిని, కె.షర్మిలసాయి సాధించారని, 466 మార్కులు పైన 76 మంది 465 మార్కులు పైన 231 మంది 463 పైన 693 మంది 460 పైన 1970 మంది సాధించారన్నారు. బైపీసీ విభాగంలో షేక్ ఫాతిమున్నీసా బేగం 440కి 438 మార్కులు, 437 మార్కులు ఎ.సింగ్, ఎన్.మణి, కేఎస్ హవీలా సాధించారని, 435పైన 39 మంది, 430 పైన 172 మంది, 400 పైన 332 మంది మార్కులు సాధించారన్నారు. 99.06 శాతం మంది ఉత్తీర్ణత సాధించారని ఆయన తెలిపారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్, ప్రిన్సిపాల్‌తో కలిసి అభినందించారు.

ఆక్వాటెక్ చాంపియన్‌షిప్ వాటర్‌పోలోకి ఎంపిక



షణ్ముఖశ్రీసాయిని అభినందిస్తున్న దృశ్యం

కాకినాడ అర్బన్, జూన్ 26: మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో వచ్చేనెల 7 నుంచి 11 వరకు జరిగే 50వ నేషనల్ ఆక్వాటెక్ చాంపియన్‌షిప్ వాటర్‌పోలోకి కాకినాడకు చెందిన షణ్ముఖశ్రీసాయి ఎంపికైంది. ఈ సందర్భంగా బుధవారం డీఎస్ఏ ప్రాంగణంలో ఆమెను అభినందించారు. డీఎస్ఏ సీఈవో బి.శ్రీనివాసకుమార్, జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్‌కు చెందిన సురేష్, ఐ.రాజు, కోచ్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే విజయోత్సవ ర్యాలీకి అడ్డంకులా'



చెక్‌పోస్టు వద్ద పోలీసుల బందోబస్తు

రాజవొమ్మంగి జూన్ 26: రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి విజయోత్సవ ర్యాలీకి పోలీసులు అడ్డంకులు సృష్టించారని టీడీపీ శ్రేణులు ఆరోపించాయి. ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ స్వగ్రామం ఎల్లవరం వెళ్లకుండా అడ్డుకున్నారని చెప్పారు. చెక్‌పోస్టు ఏర్పాటు చేసి భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారన్నారు. నియోజకవర్గంలో ఎక్కడా లేని ఆంక్షలు ఇక్కడేమిటని టీడీపీ నేతలు పోలీసుల వైఖరిపై మండిపడ్డారు. ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం అనంతరం తొలిసారిగా నియోజకవర్గానికి రావడంతో బుధవారం పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. నియోజకవర్గమంతా సాఫీగానే విజయోత్సవ యాత్ర జరగ్గా అడ్డతీగల మండలంలోని ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ స్వగ్రామమైన ఎల్లవరం గ్రామానికి మాత్రం విజయోత్సవ ర్యాలీ వెళ్లకుండా పాపంపేట జంక్షన్‌లో పోలీసులు చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. ఏ వాహనాలను చెక్‌పోస్టు దాటి వెళ్లనీయలేదు. విజయోత్సవ ర్యాలీ బుధవారం ఉంటుందని ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది షెడ్యూల్ విడుదల చేశారు. అలాగే వైసీపీ నాయకులు, కార్యకర్తలతో బుధవారం మధ్యాహ్నం ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్, మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. దీంతో ఎల్లవరం గ్రామంలోకి విజయోత్సవ ర్యాలీ వెళ్లనీయడం లేదని టీడీపీ నాయకులు తెలిపారు. కాగా అధికార పార్టీ ఎమ్మెల్యే విజయోత్సవ ర్యాలీ ఉందని ముందస్తు సమాచారం ఇచ్చినా పోలీసులు వైసీపీ నేతల సమావేశాన్ని వాయిదా వేసుకునేలా ప్రయత్నాలు చేయకపోవడంపై టీడీపీ శ్రేణులు భగ్గుమంటున్నాయి. పోలీసులకు అనంత ఉదయభాస్కర్‌పై ఉన్న ప్రేమ ఇలా బయటపడిందని పలువురు అన్నారు.

ఆరుగురికి డయేరియా..ఆస్పత్రిలో చికిత్స



క్యాంపును పరిశీలిస్తున్న వైద్యాధికారి వెంకటేశ్వరరావు

రంగంపేట, జూన్ 26: రంగంపేట పీహెచ్‌సీ పరిధిలో గల రంగంపేట మండలం ఈలకొలను గ్రామం శివారు అచ్యుతాపురానికి చెందిన ఆరుగురికి కలుషిత తాగునీరు కారణంగా మంగళవారం రాత్రి విరోచనాలు అవ్వడంతో అస్వస్థతకు గురయ్యారని రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వేణుశ్రీలక్ష్మీ తెలిపారు. సంఘటన ప్రాంతానికి హుటాహుటిన సిబ్బందితో వెళ్లి వైద్యసేవలు అందించి, నివారణ చర్యలు చేపట్టామన్నారు. అందులో భాగంగా వాటర్‌ట్యాంక్ సంబంధిత అధికారులతో శుభ్రం చేయించి పైప్‌లైన్ వాటర్ లీకేజ్‌లను సరిచేయించామన్నారు. జిల్లా వైద్యాధికారి కె.వెంకటేశ్వరరావు బుధవారం అచ్యుతాపురం గ్రామాన్ని సందర్శించి మెయిన్ ట్యాంక్ నుంచి తాగునీటి సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు, పంచాయతీ అధికారులకు సూచించారు. వైద్య సిబ్బంది బృందాలుగా ఏర్పడి ఇంటింటా సర్వే నిర్వహించి నివారణ చర్యలు చేపట్టాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని తెలిపారు. గ్రామంలో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ప్రస్తుతం అచ్యుతాపురంలో పరిస్థితి అదుపుతో ఉందని జిల్లా వైద్యాధికారి కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయనతో పాటు రంగంపేట వైద్యులు, వైద్య సిబ్బంది ఉన్నారు.

డిగ్రీ కళాశాలలో అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

మండపేట, జూన్26: మండపేట ప్రభుత్వడిగ్రీకళాశాలలో తాత్కాలిక పద్ధతిన బోటని1, పొలిటికల్ సైన్స్ 1, హిస్టరీ1, పీఈటీ 1, తెలుగు1, కామర్స్ మూడు అధ్యాపపోస్టులకు దరఖాస్తులుఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.కె.వి.శ్రీనివాసరావుతెలిపారు. పీజీలో 55శాతం మార్కులతో పాటు పీహెచ్‌డీ చేసినవారికి, డిగ్రీలో ఆంగ్లమాధ్యంలో బోధించిన అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఈనెల 29వ తేదీ సాయంత్రంలోగా దరఖాస్తులను కళాశాలలో అందించాలన్నారు.

హాస్టళ్లను సక్రమంగా నిర్వహించండి


ఎమ్మెల్యేను కలిసిన సోషల్‌వెల్ఫేర్ అధికారులు

మలికిపురం, జూన్ 26: రాజోలు నియోజకవర్గంలో ఉన్న హాస్టళ్ల నిర్వహణ సక్రమంగా ఉండాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. ఎల్ఎస్ ల్యాండ్ మార్క్ కార్యాలయంలో సోషల్ వెల్ఫేర్ అధికారులతో హాస్టళ్ల పరిస్థితులపై సమీక్షించారు. రాజోలు, కేశనపల్లి, మామిడికుదురులలో ఐదు హాస్టళ్లు ఉన్నట్లు స్థానిక సంక్షేమశాఖ అధికారి కేవీవీ సత్యనారాయణ తెలిపారు. రాజోలు బాలుర, కేశనపల్లి బాలుర హాస్టల్లు శిథిలస్థితిలో ఉన్నాయని, కొత్త హాస్టళ్లు నిర్మించాలని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. రాజోలు ఇంటిగ్రేటెడ్ బాలికల హాస్టల్, మామిడికుదురు బాలుర, బాలికల హాసళ్లలో మరమ్మతులు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. రాజోలు, కేశనపల్లి బాలుర హాస్టళ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. మరమ్మతులు నిమిత్తం రాజోలు ఎంపీపీ కేతా శ్రీనివాస్‌తో మాట్లాడగా మండల పరిషత్ నుంచి మరమ్మతులకు రూ.3లక్షలు కేటాయిస్తామని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. మామిడికుదురు ఎంపీపీతో మాట్లాడి మామిడికుదురు హాస్టళ్ల మరమ్మతులు చేపట్టాలని ఎమ్మెల్యే తెలిపారు. ఈసందర్భంగా సోషల్ వెల్ఫేర్ అధికారులు ఎమ్మెల్యేను అభినందించారు. అదేవిధంగా నియోజకవర్గంలోని పలువురు సర్పంచ్‌లు ఎమ్మెల్యేను కలిసి అభినందించారు. తమ గ్రామాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో దిండి, మట్టపర్రు, గుడిమూల సర్పంచ్‌లు ముదునూరి శ్రీనివాస్‌రాజు, కడలి దుర్గాదేవి, దెందుకూరి శ్రీహరిరాజు తదితరులు ఉన్నారు.

చారిత్రాత్మక విజయం: ఎమ్మెల్యే బండారు


వాడపల్లి వెంకన్న ఆలయంలో గ్రానైట్ మండపాన్ని ప్రారంభిస్తున్న బండారు

ఆత్రేయపురం, జూన్ 26: ఇది చారిత్రాత్మక విజయమని, తన గెలుపు కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. బుధవారం ఆయన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. వేదపండితులు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం రూ.8.50లక్షలతో వసంత మండపంలో గ్రానైట్ పనులను ప్రారంభించారు. రూ.2కోట్లతో చేస్తున్న పనులను పరిశీలించి దేవదాయ శాఖ ఇంజనీరింగ్ అధికారులకు సూచనలు అందజేశారు. ఎంతో ప్రతిష్ఠాత్మకమైన వెంకన్న ఆలయాన్ని భక్తులకు అనుగుణంగా అభివృద్ధి చేస్తామని, మాస్టర్ ప్లాన్ అమలుకు చర్యలు చేపడతామన్నారు. వాడపల్లిలో కృతజ్ఞతా పర్యటన నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ కొత్తపేట నియోజ కవర్గ అభివద్ధికి ప్రత్యేక చర్యలు చేపడతానని తెలిపారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, క్లస్టర్ ఇన్‌చార్జిలు ముళ్లపూడి భాస్కరరావు, కరుటూరి నరసింహారావు, కాయల జగన్నాథం, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దూరి సుబ్బారావు, కుడప కృష్ణమూర్తి, జనసేన మండల ఉపాధ్యక్షుడు బండారు బాబి, అల్లు వెంకటరమణ, మెర్ల రాము, జుజ్జవరపు హరిబాబు, మద్దింశెట్టి వీర వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి, మత్తు పదార్థాల వినియోగంపై ఉక్కుపాదం



డ్రగ్స్ వినియోగ వ్యతిరేక ర్యాలీలో పాల్గొన్న మంత్రి సుభాష్

రామచంద్రపురం, జూన్ 26: గంజాయి, మత్తు పదార్థాలు వినియోగం, రవాణాపై ఉక్కుపాదం మోపుతామని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. బుధవారం పట్టణంలో వీఎస్ఎం కళాశాలలో ఇంజనీరింగ్ విద్యార్థులకు మత్తుపదార్థాల వినియోగం, రవాణా వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని జరిగిన అవగాహన సదస్సులో మంత్రి సుభాష్ మాట్లాడారు. స్నేహితులు పాడవుతుంటే మిగిలిన యువత పోలీసులకు లేదా తనకు సమాచారం ఇచ్చినా చర్యలు తీసుకుంటామన్నారు. అతి త్వరలో రామచంద్రపురంలో గంజాయి అనే శబ్దం వినపడదన్నారు. డీఎస్పీ, పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని, గంజాయి వాడకం, సరఫరా చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్డీవో ఎస్.సుదాసాగర్, డీఎస్పీ రామకృష్ణ, ఏరియా ఆసుపత్రి పర్యవేక్ష వైద్యులు డాక్టర్ ప్రవీణ్, సీఐ దొరరాజు మాట్లాడారు. అనంతరం డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీని మంత్రి సుభాష్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, టీడీపీ నాయకులు మేడిశెట్టి శేషారావు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కడియాల రాఘవన్, మున్సిపల్ కమిషనరు శ్రీనివాసులు, సీఐలు కె.శ్రీధర్‌కుమార్, ఎస్ఈడీ ఇన్‌స్పెక్టర్ ఫణికుమార్, ఎస్ఐలు సురేష్‌బాబు, సురేంద్ర, హరికోటి శాస్త్రి, జానీ బాషా, చైతన్యకుమార్, విద్యార్థులు తదితరులుపాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషిచేద్దాం

అంబాజీపేట, జూన్26: డ్రగ్స్ రహితసమాజం కోసం కృషి చేయాలని సీఐ డి.ప్రశాంత్‌కుమార్, తహసీల్దార్ జె.విమలకుమారి, ఎంపీడీవో జీవీ సరోవర్ అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక ఎస్ఎన్ఎం కళాశాలనుంచి సెంటర్ వరకు ర్యాలీ చేపట్టి, సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఎస్ఐ కె.చిరంజీవి, వైద్యాధికారి శ్రీనివాస్, సీహెచ్‌వో బి.అప్పారావు, కళాశాల కరస్పాండెంట్ సాయిప్రసాద్, ప్రిన్సిపాల్ ఎస్.రాధామణి పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలి

ముమ్మిడివరం, జూన్ 26: విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా ఉన్నత పౌరులుగా ఎదగాలని ఎక్సైజ్ ఎస్ఐ డి.రామారావు పేర్కొన్నారు. డ్రగ్స్ వినియోగం, రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ముమ్మిడివరం తారా జూనియర్ డిగ్రీ కళాశాలలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ జీవీకే సుమంత్, హెచ్‌సీ ఎ.రాజేంద్రప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల రహిత సమాజానికి కృషి

కొత్తపేట, జూన్ 26: మాదక ద్రవ్యాల రహిత సమాజం కోసం పాటుపడదామని రావులపాలెంసీఐ ఎం.రామ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం కొత్తపేట ఎస్ఐ ఎం.అశోక్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఆత్రేయపురం ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్‌పై అవగాహన ర్యాలీ

రావులపాలెం, జూన్26: స్థానిక కళా వెంకట్రావు సెంటరు వద్ద జాతీయ రహదారిపై సీఐ జేమ్స్ రత్నప్రసాద్ ఆధ్వర్యంలోయువత మేలుకో-భవితను మలుచుకో అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి డ్రగ్స్ రహిత రాష్ట్రాన్ని తీర్చిదిద్దుదామంటూ ప్రతిజ్ఞ చేశారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులకు డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.

● అమలాపురం, ఉప్పలగుప్తం, అల్లవరం మండలాల్లో వేడుకలు ● హైస్కూల్‌కు స్పోర్ట్స్ కిట్లు పంపిణీ ● కేకుల కటింగ్ కార్యకర్తలకు పంపిణీ

ఎమ్మెల్యే ఆనందరావు జన్మదిన వేడుకలు




అమలాపురం: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు. ఉప్పలగుప్తం:టీడీపీ నాయకుడు సమకూర్చిన స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేస్తున్న ఆనందరావు, అల్లవరం: ఆనందరావు జన్మదిన వేడుకల్లో టీడీపీ, జనసేన నాయకులు

అమలాపురం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు జన్మదిన వేడుకలను అభిమానులు, పార్టీ శ్రేణుల సమక్షంలో బుధవారం నిర్వహించారు. హౌసింగ్ బోర్డు కాలనీలోని ఆనందరావు స్వగృహం వద్ద నుంచి భారీ ఊరేగింపుగా ముక్తేశ్వరం రోడ్డులో ఉన్న సత్యనారాయణ గార్డెన్స్‌కు చేరుకున్నారు. విజయోత్సవ సంబరాలు, జన్మదిన వేడుకను పురస్కరించుకుని పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి, జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడ స్వామినాయుడు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, గంధం పల్లంరాజు సమక్షంలో కేక్ కట్ చేశారు. నియోజకవర్గంనలుమూలల నుంచి వచ్చిన కూటమి శ్రేణులు శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు నల్లా స్వామి, దున్నాల దుర్గ, బొర్రా ఈశ్వరరావు, మాకిరెడ్డి వీఎస్ఎస్ పూర్ణిమ, చింతా శంకరమూర్తి, పిచ్చిక శ్యామ్, చొల్లంగి సత్యసాయిబాబాతో పాటు పోలీసు అధికారులు తదితరులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

అల్లవరం: టీడీపీ కార్యాలయం వద్ద మండల శాఖ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు ఆధ్వర్యంలో బుధవారం అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు జన్మదిన వేడుక నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల సమక్షంలో ఎమ్మెల్యే జన్మదిన కేక్ కట్ చేశారు. అనంతరం భారీ ర్యాలీగా అమలాపురం తరలివెళ్లారు. కార్యక్రమంలో తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు వేగిరాజు వెంకట్రాజు, బండిగుప్తాపు సత్తిబాబు, కేవీ, మంతెన సురేష్‌రాజు, గుబ్బల రాంప్రసాద్, పోతుల నాగరాజు, సర్పంచ్‌లు రొక్కాల విజయలక్ష్మి, తోట శ్రీదేవి, వేగిరాజు సుబ్బరాజు, జనసేన ప్రముఖులు చికిలే చిట్టిబాబు, కంకిపాటి వీరబాబు, పిండి గణపయ్య, పిల్లా ప్రసాద్, బీజేపీ నాయకుడు సుంకర సాయి తదితరులు పాల్గొన్నారు. బెండమూర్లంకలో ఎమ్మెల్యే ఆనందరావు జన్మదిన వేడుకలో గిడుగు భాస్కరరావు, యాళ్ల అబ్బులు, గుర్రం బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: అమలాపురంలో బుధవారం జరిగిన అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు జన్మదిన సంబరాలకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి అధిక సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. ఉప్పలగుప్తం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గాలిదేవరసురేష్‌కుమార్ సమకూర్చిన రూ.20వేలు విలువైన స్పోర్ట్స్ కిట్లను ఎమ్మెల్యే ఆనందరావు గొల్లవిల్లి హైస్కూలు పీడీ గొలకోటి ఫణీంద్రకుమార్‌కు అందించారు. కార్యక్రమంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు అరిగెల నానాజీ, వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు గొలకోటి చిన్నా, కూటమి నాయకులు పలచోళ్ల పద్మనాభం, ఆకుల సూర్యనారాయణమూర్తి, నిమ్మకాయల చెల్లయ్యనాయుడు, దంగేటి బాబులు, ఏఎంసీ మాజీ చైర్మన్ నిమ్మకాయల సూర్యనారాయణమూర్తి, మద్దింశెట్టి సురేష్, గొలకోటి సత్తిరాజు, చిక్కం ఉమేష్, ఆకేటి పెద్ద, చిక్కం కాసు, కంకటాల రాము, గుత్తుల నాగేశ్వరరావు, చిక్కం సూర్యమోహన్, చీకట్ల ఏసు, కుచ్చెర్లపాటి పెద్దిరాజు, గుత్తుల శ్రీనివాస్, దంగేటి చిట్టిబాబు, బూసి బుజ్జిదొర, గొలకోటి చిట్టిబాబు, పోలిశెట్టి శివాజీ, రవణం మధు, సలాది శ్రీనివాసరావు, సర్పంచ్‌లు చిక్కం పెదబాబు, నల్లా బాబండి, జోగి రాజేశ్వరీరాజా, పెయ్యల రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకున్న టీడీపీ నాయకుడు

ముమ్మిడివరం, జూన్ 26: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని, చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని, ముమ్మిడివరంలో దాట్ల సుబ్బరాజు ఎమ్మెల్యేగా విజయం సాధించాలని అయ్యప్పస్వామివారికి 101 కొబ్బరికాయలు కొడతానని సత్తి నూకరాజు మొక్కుకుడున్నాడు. బుధవారం ముమ్మిడివరంలోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయం వద్ద నూకరాజు 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. పొత్తూరి విజయభాస్కరవర్మ, పెన్మెత్స జగ్గప్పరాజు, సుంకర అయ్యన్న పాల్గొన్నారు.

కె.గంగవరం: రాష్ట్రంలోకూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని, చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని కోటిపల్లి టీడీపీ యువత గ్రామదేవతకు మొక్కుకున్నారు. బుధవారం అమ్మవారికి మొక్కు చెల్లించుకున్నారు. ఈకార్యక్రమానికి మంత్రి వాసంశెట్టి సుభాష్ హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధన జరిగింది. మంత్రి సుభాష్ తండ్రి సత్యం, టీడీపీ నాయకులు వెంటూరు వీర్రాఘవులు చౌదరి, గొడవర్తి రామకృష్ణ చౌదరి, చీకట్ల రాము, సోమేష్, దంగేటి విఘ్నేశ్వరరావు, దేవరపల్లి వెంకటేశ్వరరావు, బలుసు శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యోగా, ధ్యానంతోనే సంపూర్ణ ఆరోగ్యం

రాయవరం, జూన్ 26: యోగా, ధ్యానంతో మానసిక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత లభిస్తుందని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. బుధవారం పసలపూడి ఓం శాంతి ఆశ్రమంలో జరుగుతున్న ధ్యాన శిబిరం ముగింపు సందర్భంగా ఆయన ఓం శాంతి ఆశ్రమాన్ని సందర్శించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఓం శాంతి ఆశ్రమం ద్వారా వృద్ధులకు అందిస్తున్న సేవలను కొనియాడారు. ఆశ్రమంలోని దేవతామూర్తులను మంత్రి దర్శించుకున్నారు. తొలుత మౌంట్ అబూ నుంచి వచ్చిన భగవాన్ ధ్యానంపై శిక్షణ ఇచ్చారు. ఓం శాంతి ఆశ్రమ నిర్వాహకులు మంత్రి సుభాష్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఓం శాంతి ఆశ్రమ నిర్వాహకులు బీకే విజయ్ కుమార్, బీకే మాధవి, సుధ, మణి పాల్గొన్నారు.

తోటపేట ఉపసర్పంచ్ రాజీనామా

ద్రాక్షారామ, జూన్ 26: రామచంద్రపురం మండలం తోటపేట ఉపసర్పంచ్ మేర్నీడి శ్రీనివాస్ వ్యక్తిగత కారణాలతో ఉపసర్పంచ్ పదవికి రాజీనామ చేశారు. రాజీనామ పత్రాన్ని ఎంపీడీవోకు అందజేశారు.

ముమ్మిడివరంలో అన్నక్యాంటీన్‌ను ప్రారంభిస్తాం


ఎమ్మెల్యేకు చిత్రపటాన్ని బహూకరిస్తున్న దృశ్యం

ముమ్మిడివరం, జూన్ 26: తెలుగుదేశం ప్రభుత్వంలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన అన్న క్యాంటీన్లను వైసీపీ ప్రభుత్వం మూసివేసి పేదవాడి పొట్టకొట్టి అన్యాయం చేసిందని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ బళ్లగేటు సెంటర్‌లో ఉన్న అన్నక్యాంటీను భవనాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించేందుకు చర్యలు చేపట్టామన్నారు. రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెట్టి అభివృద్ధి, ప్రజా సంక్షేమం అందించే సత్తా చంద్రబాబు నాయుడుకే ఉందన్నారు. దాట్ల పృథ్వీరాజ్, గొలకోటి దొరబాబు, చెల్లి అశోక్, తాడి నరసింహారావు, పొద్దోకు నారాయణరావు, దొమ్మేటి రమణకుమార్, అర్ధాని శ్రీనివాసరావు, కనుమూరి రాజ్‌వర్మ, గుద్దటి జమి, గోదశి పుండరీష్, దూడల స్వామినాయుడు, కాకర్లపూడి రాజేష్, ములపర్తి బాలకృష్ణ, కడలి నాగు, అడబాల సతీష్, కట్టా సత్తిబాబు, దివి మహాలక్ష్మి, నడింపల్లి సుబ్బరాజు, చిక్కాల అంజిబాబు, గొల్లపల్లి గోపి, గీసాల చంద్రరావు, మెండి కృష్ణబాబు, మట్టా రాహుల్, బడుగు సందీప్‌సాయి, చింతలపూడి కొండబాబు, చింతపల్లి రాజు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న సుబ్బరాజు

ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసి తొలిసారిగా నియోజకవర్గానికి విచ్చేసిన దాట్ల సుబ్బరాజు బుధవారం నగర పంచాయతీ పరిధిలోని పల్లిపాలెం శ్రీహరిసాకేత వేంకటేశ్వర స్వామిని బుధవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు కొండవీటి రాంబాబు, ఆదిత్యశర్మల ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చారణలు, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపించి పండిత ఆశీర్వాదం అందించారు. వినాయకుని చిత్రపటాన్ని బహూకరించారు. మురమళ్ల నుంచి భారీ ర్యాలీగా తరలివచ్చిన ఎమ్మెల్యే సుబ్బరాజుకు పల్లిపాలెం సెంటర్‌లో మహిళలు, అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు, మంగళ హారతులతో ఘన స్వాగతం పలికి భారీ ఎత్తున బాణసంచా కాల్చారు. ఈసందర్భంగా పల్లిపాలెం గ్రామస్థులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు నాగిడి నాగేశ్వరరావు, పెన్మెత్స జగ్గప్పరాజు, దాట్ల పృథ్వీరాజ్, చెల్లి అశోక్, గొలకోటి దొరబాబు, తాడి నరసింహారావు, పొద్దోకు నారాయణరావు, దొమ్మేటి రమణకుమార్, కనుమూరి రాజ్‌వర్మ, గుద్దటి జమి, అర్ధాని శ్రీనివాసరావు, గోదశి పుండరీష్, దూడల స్వామి, కాకర్లపూడి రాజేష్, దాట్ల వర్మ, ములపర్తి బాలకృష్ణ, కడలి నాగు, అడబాల సతీష్‌కుమార్, దివి మహాలక్ష్మి, కట్టా సత్తిబాబు, మాదాల బుజ్జి, మాదాల పరంకుశం, చిక్కాల అంజిబాబు, గొల్లపల్లి గోపి, విళ్ల వీరాస్వామినాయుడు, నడింపల్లి సుబ్బరాజు, మెండి కమల, యాళ్ల ఉదయ్, మిమ్మితి చిరంజీవి, కురసాల శివబాబు, దంగేటి శ్రీను, నడింపల్లి శ్రీనివాసరాజు, పళ్ల రాజబాబు, సత్తి నూకరాజు, అల్లూరి శ్రీహరిరాజు, పెన్మెత్స చంటి రాజు, కనుమూరి శివరామరాజు, అల్లూరి దినేష్‌వర్మ పాల్గొన్నారు.

అసిస్టెంట్ లేబర్ ఇన్‌స్పెక్టర్‌ను నియమించండి

యానాం, జూన్ 26: యానాం కార్మిక శాఖకు అసిస్టెంట్ లేబర్ ఇన్‌స్పెక్టర్‌ను ప్రభుత్వం నియమించాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. మూడు నెలలుగా ఎవర్ని నియమించపోవడం అంటే కార్మికుల హక్కులు గాలికి వదిలేయడమేనని జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్ విమర్శించారు. ప్రాంతీయ పరిపాలనాధికారి, ఎమ్మెల్యే అశోక్ స్పందించి అసిస్టెంట్ లేబర్‌ఇన్‌స్పెక్టర్‌ను నియమించాలన్నారు.

మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ ర్యాలీ

యానాం, జూన్ 26: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం యానాం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఎస్పీ రాజశేఖరన్ ర్యాలీని ప్రారంభించారు. ముందుగా మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులతో కలిసి పోలీసులు యానాం పురవీధుల్లో ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు.

విష జ్వరాలపై ఇంటింటా సర్వే నిర్వహించాలి


బెల్లంపూడిలో విష జ్వరాలపై అధికారులతో మాట్లాడుతున్న అడిషనల్ డిఎంఅండ్‌హెచ్‌వో భరత్‌లక్ష్మి, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, జూన్ 26: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ భరత్‌లక్ష్మి సూచించారు. బెల్లంపూడి గ్రామంలో జ్వరపీడితులు ఎక్కువగా ఉండటంతో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణతో కలిసి ఆమె గ్రామంలో పర్యటించారు. గ్రామంలో ప్రస్తుతం ఒక వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశామని, ఇంటింటా ఫీవర్‌సర్వే నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. ప్రస్తుతం గ్రామంలో వైరల్‌జ్వరాలు, టైఫాయిడ్ జ్వరాలను గుర్తించినట్లు ఆమె తెలిపారు. అదేవిధంగా ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ గ్రామంలో పర్యటించి విషజ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని గ్రామస్తులను కోరారు. జ్వరపీడితులతో ఆయన మాట్లాడారు. వారి వెంట ఎంపీడీవో సీహెచ్ త్రిశూలపాణి, వైద్యులు డాక్టర్ రీయాజ్‌సున్నిసాభేగం, ఎంపీహెచ్‌వో శ్రీనివాసరెడ్డి, సబ్‌యూనిట్ ఆఫీసర్ రాజశేఖర్, వైద్య సిబ్బంది ఉన్నారు.

గోవుల అక్రమ రవాణాను అడ్డుకున్న భజరంగ్‌దళ్

అమలాపురం టౌన్, జూన్ 26: గోవులను అక్రమంగా రామచంద్రపురం కబేళాకు తరలిస్తుండగా ఈదరపల్లి టీటీడీ కల్యాణ మండపం వద్ద భజరంగ్‌దళ్ కార్యకర్తలు అడ్డుకున్నారు. ఒక వాహనంలో ఐదు గోవులు, రెండు గేదె దూడలను కట్టి ఆహారం నీరు లేకుండా అక్రమంగా తరలిస్తుండగా అడ్డుకుని అమలాపురం పట్టణ పోలీసు స్టేషన్‌కు వాహనం సహా తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి వారి సమక్షంలోనే భజరంగ్‌దళ్ కార్యకర్తలతో కలిసి ఇందుపల్లిలోని గోశాలకు గోవులను అప్పగించారు. గోవులను అక్రమంగా రవాణా చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని భజరంగ్‌దళ్ నాయకులు డిమాండు చేశారు భజరంగ్‌దళ్ రాష్ట్ర సహ కన్వీనర్ శిరంగు నాయుడు, నగర ప్రముఖ్‌లు ఊటుకూరి సాంబయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రధాత గంగయ్య

మలికిపురం, జూన్ 26: మాజీ ఎమ్మెల్యే మంగెన గంగయ్య నియోజకవర్గ అభివృద్ధి ప్రధాత అని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. గంగయ్య వర్ధంతి సందర్భంగా మలికిపురం కూడలిలో ఉన్న ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే, నాయకులు గజమాలవేసి నివాళులర్పించారు. గంగయ్య రాజోలు నియోజకవర్గంలో 1989 నుంచి 1994 వరకు ఎమ్మెల్యేగా నిస్వార్థంగా, నిజాయితీగా పనిచేసిన నాయకుడని అన్నారు. కార్యక్రమంలో చిటికెల రామ్మోహనరావు, మంగెన రాధాకృష్ణ, మంగెన భూదేవి, గుండుబోగుల పెదకాపు, కేతా శ్రీనివాస్, ఎంవీ సత్యవాణి, అడబాల యుగంధర్, ముప్పర్తి నాని, గుబ్బల శ్రీనివాస్, చాగంటి స్వామి, తాడి సత్యనారాయణ, భూపతిరాజు సాయిబాబురాజు, కాకి లక్ష్మణ్, మంగెన నాని, అడబాల సాయిబాబు, గుబ్బల ఫణికుమార్, గెడ్డం మహాలక్ష్మిప్రసాద్, బందెల పద్మ, పినిశెట్టి బుజ్జి పాల్గొన్నారు.

రాజోలు: తాటిపాకలో మాజీ ఎమ్మెల్యే మంగెన గంగయ్య వర్ధంతి సభ బుధవారం నిర్వహించారు. తాటిపాక సెంటర్‌లో గంగయ్య విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఉపసర్పంచ్ కటికిరెడ్డి బుజ్జి, పోతు కాశీ, జక్కంపూడి వాసు, తాటికాయల బాబులు, కటికిరెడ్డి సుబ్రహ్మణ్యం, లంకలపల్లి సుబ్బారావు, కటికిరెడ్డి సుబ్రహ్మణ్యం, యెరుబండి వెంకన్న, చిన్నబుజ్జి, తెలగారెడ్డి వాసుప్రసాద్, ఏపుగంటి సత్యనారాయణ, కుంపట్ల రామకృష్ణ పాల్గొన్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.1,00,001 విరాళం

అంతర్వేది, జూన్ 26: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యాన్నదాన పథకానికి తణుకుకి చెందిన తుండూరి శ్రీనివాసరావు-వనజ దంపతులు రూ.1,00,001 విరాళాన్ని సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ అందించారు.

బండారుకు అరుదైన సత్కారం

కొత్తపేట, జూన్ 26: ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలుపొందిన బండారు సత్యానందరావుకు స్థానిక ఆర్యవైశ్య సభ్యుడు పచ్చిపులుసు బాపన్న గాంధీజీ ప్రతిమనుఅందజేశారు. రూపాయి నాణేలను పూలహారంగా తయారు చేయించి మెడలో వేసి తలపాగా పెట్టి సత్కరించారు. ఈసత్కారానికి బండారు ఉబ్బితబ్బిబ్బయ్యారు. బండారు బులితాత, బండారు రాజేష్, బంగారంపాల్గొన్నారు.

హోమియో డాక్టర్ సాయం

మామిడికుదురు, జూన్ 26: ఈదరాడకు చెందిన దొడ్డవరపు వెంకటేశ్వరరావు ఇటీవల మృతి చెందగా అతడి ఇద్దరి కుమార్తెలకు బుధవారం గ్రామానికి హోమియో డాక్టర్ చిక్కం సత్యసంజీవ్ రూ.40వేలు అందించారు. గ్రామానికి చెందిన కొర్లపాటి శ్రీరామమూర్తి కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా స్థానిక పెద్దలతో కలిసి అతడికి రూ.10వేలు అందించారు. స్నేహితులు, బంధువులతో కలిసి విరాళాలుగా ఈమొత్తాన్ని సేకరించారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: --
వెంకటరమణ	: కల్కి 2898 ఏడీ
శ్రీలలిత	: మహారాజ
శేఖర్ స్క్రీన్-1	: కల్కి 2898 ఏడీ
శేఖర్ స్క్రీన్-2	: కల్కి 2898 ఏడీ
రమా	: ప్రభుత్వ జూనియర్ కళాశాల
గణపతి	: హరోం హర
వెంకటపద్మావతిస్క్రీన్-1	: కల్కి 2898
వెంకటపద్మావతి స్క్రీన్-2	: కల్కి 2898 ఏడీ

హెడ్‌వర్క్స్ ప్రాజెక్టులపై వివరణ

పి.గన్నవరం, జూన్ 26: నియోజకవర్గంలోని ఏటిగట్లు, గ్రోయిన్స్ తదితర అంశాలపై ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు సబ్‌డివిజన్ హెడ్ వర్క్స్ డీఈ జి.శ్రీనివాస్ బుధవారం జనసేన క్యాంపు కార్యాలయంలో కలిసి వివరించారు. మండలంలోని వై.కొత్తపల్లి, లంకలగన్నవరం, మానేపల్లి, మామిడికుదురు మండలంలోని పెదపట్నం, అప్పనపల్లి తదితర గ్రామాల్లో హెడ్ వర్క్స్ సమస్యలపై వివరించడంతో పాటు ప్రభుత్వానికి పంపించిన ప్రతిపాదనలపై ఎమ్మెల్యేకు వివరించారు. తొలుత జేఈలు డి.రాధాకృష్ణ, యూసీహెచ్‌వీ ప్రసాద్‌బాబు, టీవీఎల్ఎన్ మూర్తిలతో కలిసి డీఈ జి.శ్రీనివాస్ ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

రైతులకు పంట ప్రోత్సాహకం పంపిణీ

యానాం, జూన్26: యానాం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు పంట ప్రోత్సాహక పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.స్థానిక మార్కెట్‌కమిటీలో యానాం వ్యవసాయ శాఖ డీడీ శివసుబ్రమణ్యయన్ అధ్యక్షతన జరిగినకార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, పరిపాలనాధికారి మునిస్వామి హాజరూయ్యారు. రైతుల సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మల్లాడి చెప్పారు. అనంతరం 2023-24 ఏడాదికి యానాంలో వరి పంటను పండించే అర్హులైన రైతులకు పంట ప్రోత్సాహక నగదును, పలువురు రైతులకు పశుగ్రాసం, కొబ్బరి రైతులకు పరిహారానికి సంబంధించి 331మందికి 24.14లక్షల చెక్కులను రైతులకు అందజేశారు. వ్యవసాయాధికారి చిక్కాల జోగిరాజు, ఫీల్డ్‌మేన్ కేవీ సుబ్బరావు, ఖాన్ పాల్గొన్నారు.

టిడ్కో సమస్యలను పరిష్కరించండి: వేగుళ్ల


టిడ్కో గృహాల సముదాయం వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, జూన్ 26: టిడ్కో గృహాల సముదాయంలో సమస్యలు పరిష్కరించేందుకు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులకు 20రోజులు గడువు ఇస్తున్నట్టు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు తెలిపారు. గడువులోగా సమస్యలు పరిష్కరించకపోతే నాతో పాటు మీరు కూడా ఇక్కడ సమస్యలు తీరే వరకు ఉండాల్సిందేనని ఎమ్మెల్యే వేగుళ్ల హెచ్చరించారు. స్థానిక గొల్లపుంతకాలనీలో టిడ్కో గృహాలు రెండో దశ ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. బుధవారం వేగుళ్ల మున్సిపల్, టిడ్కో, సచివాలయ ఉద్యోగులతో కలిసి కాలనీలో పర్యటించి జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. వేగుళ్ల వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, కమిషనర్ బి.రాము తదితరులు ఉన్నారు. ఖాళీ ప్రదేశాల్లో కూరగాయాలను పండించుకోవాలని కాలనీవాసులకు ఎమ్మెల్యే సూచించారు.

పంచాయతీ కార్యాలయంలో నాయకుల ఫొటోలు

కె.గంగవరం, జూన్ 26: కె.గంగవరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్‌కల్యాణ్ ఫొటోలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు అల్లూరి దొరబాబు, నేమాని అబ్బు, చిర్రా రాజ్‌కుమార్, గంగాబత్తుల కాశీ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఫొటోలు ఏర్పాటు

మామిడికుదురు, జూన్ 26: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఫొటోలను పెదపట్నంలంక పంచాయతీలో బుధవారం సర్పంచ్ సుందరనీడి రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. కొమ్ముల దొరబాబు, పంచాయతీ కార్యదర్శి డి.సురేష్ పాల్గొన్నారు.

మోడరన్ విద్యార్థులకు మంత్రి సుభాష్ అభినందన

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 26: మోడరన్ జూనియర్ కళాశాలలో ఇంటర్ బెటర్‌మెంట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను మంత్రి సుభాష్ బుధవారం అభినందించారు. ఎంపీసీలో పి.భారతి 466, డి.నీరజ 465, బి.తరుణ్ కుమార్ 464, డి.శ్రీ అంజి464, జష్వంత్ 463, బైపీసీలో షేక్ అహ్మద్ అశ్వక్ 427, పి.ఎల్. ఎస్ శ్రావ్య 426, బి.చాందిని 421 తదితరులను మంత్రి సుభాష్ అభినందించారు. ప్రిన్సిపాల్ సీహెచ్ రాజేష్, మోడరన్ అధినేత జీవీరావు, వైస్ ప్రిన్సిపాల్ పి.ఎస్.ప్రకాష్ పాల్గొన్నారు.

సమాజ హితానికి దాతల సహకారం అవసరం

అంబాజీపేట, జూన్26: సమాజంలో ఇబ్బందులు ఎదుర్కొనేవారికి దాతల సహకారం అవసరమని రాష్ట్ర ప్రభుత్వ ఆస్థాన శిల్పి రాజకుమార్ వడయార్ అన్నారు. అమలాపురానికి చెందిన పచ్చిగోళ్ల సత్యనారాయణమూర్తి-రోహిణి దంపతుల జ్ఞాపకార్థం కుమారులు సత్యనారాయణరావు(సతీష్), రాధాకృష్ణ సహకారంతో రూ.లక్షతో సమకూర్చిన బాడీఫ్రీజర్ బాక్స్, రూ.1.30లక్షలతో సమకూర్చిన30సిమెంట్ బెంచీలను చిరతపూడిలోని సమాజ సేవకులు ఎల్ఆర్‌కే మూర్తి, ఇళ్ల ఏడుకొండలకు అందించారు.

తాత్కాలిక ముంపును తట్టుకునే ఎంటీయూ-1232

ఉప్పలగుప్తం, జూన్ 26: సార్వాలో తాత్కాలికంగా ముంపును తట్టుకుని అధిక దిగుబడి ఇచ్చే ఎంటీయూ-1232 వరి రకాన్ని ప్రయోగాత్మకంగా సాగుకు ప్రోత్సహిస్తున్నట్టు ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త ఎం.నందకిశోర్ తెలిపారు. భీమనపల్లిలో బుధవారం ఈ రకం సాగును రైతులకు వివరించారు. భీమనపల్లిలో అపరాల పైరును పరిశీలించి, ఆకుముడత నివారణకు సూచనలు చేశారు. వ్యవసాయ శాఖ ఏడీ ఏవీఎస్ రాజశేఖర్, వ్యవసాయాధికారులు జి.మనోహర్, జి.కుమార్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాది నారాయణరెడ్డి సంస్మరణ సభ

మండపేట, జూన్26: నిబద్ధత కలిగినవ్యక్తి కేఆర్‌సీ నారాయణరెడ్డి అని పలువురు వక్తలు అన్నారు. ఆలమూరు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, మండపేటకు చెందిన ప్రముఖన్యాయవాది కె.ఆర్.సి.నారాయణరెడ్డి సంతాప సభ స్థానిక ఆలమూరు తాలుకారైస్‌మిల్లర్స్ భవనంలో బుధవారం జరిగింది. ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన సభలో నారాయణరెడ్డి చిత్రపటానికివిద్యావేత్తలు, నాయకులు, పట్టణ ప్రముఖులు నివాళులర్పించారు.

వెంకటస్వామినాయుడు సేవలు అమూల్యమైనవి

మామిడికుదురు, జూన్ 26: రూరల్ బ్యాంకు మాజీ చైర్మన్‌గా, పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షుడిగా నయినాల వెంకటస్వామినాయుడు (పిచ్చియ్య) చేసిన సేవలు అమూల్యమైనవని సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, మాజీ సర్పంచ్ నయినాల సత్యనారాయణమూర్తి కొనియాడారు. స్వామినాయుడు సంస్మరణ సభ బుధవారం మామిడికుదురులో జరిగింది. సొసైటీ చైర్మన్‌గా, పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షుడిగా ఆయన అనేక సేవలు అందించారని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ యెరుబండి లక్ష్మయ్య, ప్రధానోపాధ్యాయిని సీహెచ్ నిరంజని, మైలవరపు రవీంద్రనాథ్, కాండ్రేగుల గోపాలకృష్ణ, నయినాల వెంకటేశ్వరరావు, రుద్ర శ్రీను తదితరులు పాల్గొన్నారు.